క్లుప్తంగా

రేపు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ముట్టడి

ములుగు : ఈ నెల 8వ తేదీన ములుగు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ముట్టడించనున్నట్లు జాతీయ మాల మహానాడు ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జ్ జనగాం రవీందర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మాలల పట్ల సవతి తల్లి ప్రేమ చూపిస్తున్నారని విమర్శించారు. జీఓ 99 తీసుకువచ్చి మాల విద్యార్థుల భవిష్యత్‌ను నాశనం చేశారని ఆరోపించారు. మాలల పట్ల ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఈ నెల 8న నిర్వహించే కార్యాలయ ముట్టడికి మాల సోదరులు హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పండ్ల పంపిణీ



ఏటూరునాగారం : ఏటూరునాగారం మిలాద్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మహమ్మద్ ప్రవక్త పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సామాజిక ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సలీంఖాన్, అయ్యూబ్, ఖలీల్, గౌస్, మిలాద్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఆదివాసీలకు అన్యాయం

వెంకటాపురం(కె) : లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చడం వల్ల ఆదివాసీలకు అన్యాయం జరుగుతోందని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ అతిథి గృహం ఆవరణంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆదివాసీలకు దక్కాల్సిన ఉద్యోగ ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నాయకులు కృష్ణబాబు, శంకర్, నాగరాజు, రఘు, రాజ్ కుమార్, సంపత్ తదితరులు ఉన్నారు.

తాగునీటి బోరుకు మోటారు ఏర్పాటు



కాటారం : మండల కేంద్రంలోని గారెపల్లి అంబేడ్కర్ కాలనీలో తాగునీటి బోరుకు శనివారం నూతన మోటారు ఏర్పాటు చేశారు. కొన్ని రోజుల క్రితం బోరు మోటార్ రిపేర్‌కు రావడంతో కాలనీవాసులు తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు ఆదేశాల మేరకు కాంగ్రెస్ నాయకుడు చీమల రాజు నూతన మోటార్ ఏర్పాటు చేశారు. తాగునీటి ఇబ్బందులు తీర్చడానికి కృషి చేసిన మంత్రి శ్రీధర్‌బాబు, కాంగ్రెస్ నాయకుడు చీమల రాజుకు కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.నాయకులు కొట్టె శ్రీహరి, మంత్రి నరేశ్, ప్రభాకర్, కాలనీ మహిళలు పాల్గొన్నారు.

నేడు కోటంచ ఆలయం మూసివేత

రేగొండ : సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా మండలంలోని కొడవటంచ లక్ష్మీనరసింహా స్వామి ఆలయాన్ని నేడు (ఆదివారం) ఉదయం 11 గంటలకు మూసి, సోమవారం ఉదయం 7గంటల నుంచి స్వామి వారి దర్శనాలు కల్పించనున్నట్లు ఈఓ మహేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఫాగింగ్‌పై నిర్లక్ష్యం..



చల్వాయి గ్రామపంచాయతీలో మూలనపడి ఉన్న ఫాగింగ్ యంత్రాలు



గోవిందరావుపేట ఎన్టీఆర్ కాలనీ డ్రైయినేజీలో పేరుకుపోయిన చెత్త



పస్రా గ్రామంలోని రెడ్డి బజార్‌లో..

వేధిస్తున్న దోమల బెడద

- అనారోగ్యం, విషజ్వరాల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

గోవిందరావుపేట : ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని గ్రామాల్లో గల రహదారుల వెంట, ఖాళీ స్థలాల్లో నీరు నిల్వ ఉంటుంది. ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండడంతో అందులో దోమలు పెరుగుతున్నాయి. వాటి నియంత్రణకు గ్రామాల్లో సక్రమంగా ఫాగింగ్ చేపట్టకపోవడంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో సీజనల్ వ్యాధులతో ప్రజలు బాధపడుతున్నారు. మండలంలోని 18 గ్రామ పంచాయతీలు ఉండగా కొన్ని గ్రామ పంచాయతీలకు ఇప్పటికీ ఫాగింగ్ యంత్రాలు లేవు.

ఫాగింగ్ చేయడంలో నిర్లక్ష్యం

వర్షాకాలం వ్యాధుల కాలం అయినందునా ప్రతి రోజు గ్రామాల్లో ఫాగింగ్ చేపట్టాలి. కానీ మండలంలో 18 గ్రామ పంచాయతీలు ఉండగా ఇప్పటికీ 5 గ్రామ పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలు అందుబాటులో లేవు. యంత్రాలు ఉన్న గ్రామాల్లో సైతం పలు కారణాలతో అరకొరగా ఫాగింగ్ చేపడుతున్నారు. దీనికి తోడు ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామాల్లోని అంతర్గత రహదారుల వెంట, ఇళ్ల మధ్యన ఉన్న ఖాళీ స్థలాల్లో వర్షపు నీరు నిల్వ ఉండి దోమలు వృద్ధి చెందుతున్నాయి. కనీసం అధికారులు ఖాళీ స్థలాల్లో పెరిగిన గడ్డిని సైతం తొలగించడం లేదు. దీంతో పగలు, రాత్రి తేడా లేకుండా దోమలు ప్రజలపై తమ ప్రతాపాన్ని చూపుతున్నాయి. దీంతో ప్రజలు తరచూ సీజనల్ వ్యాధుల బారిన పడుతున్నారు.

దోమలనివారణకు ముందస్తు చర్యలు శూన్యం

వానాకాలం ప్రారంభమై రెండు నెలలు పూర్తి అవుతున్నా.. దోమల నివారణకు అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. మండల కేంద్రంలోని ఎన్టీఆర్ కాలనీ, గ్రంథాలయం వెనుకాల, పస్రా లోని రెడ్డి బజార్, అభ్యుదయ కాలనీ, చల్వాయి లోని హాస్టల్ గడ్డ, చర్చి బజార్‌లోని ఇళ్ల మధ్య ఖాళీ స్థలాల్లో నీరు నిలవడంతో మురుగు నీటితో దుర్వాసన వెదజల్లుతుంది. దోమల బెడదతో ప్రజలు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామాల్లో దోమల బెడద వల్ల ఇప్పటికే ప్రజలు టైఫాయిడ్, మలేరియాతో పాటు తీవ్రమైన జ్వరం బారిన పడుతూ ఆస్పత్రుల వెంట తిరుగుతున్నారు. వానాకాలంలో సీజనల్ వ్యాధులు నివారించేందుకు బ్లీచింగ్ చల్లడం, రసాయనాల పిచికారీ, తరచుగా నీళ్ల ట్యాంకుల శుభ్రం చేయడం, వీధుల్లో ఫాగింగ్ చేయడం వంటి చర్యలు చేపట్టాల్సి ఉంది. కొన్ని గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ఫాగింగ్ యంత్రాలు వృథాగానే ఉంటున్నాయి.

దోమల బెడదను నివారించాలి



మా కాలనీలో దోమల బెడద విపరీతంగా పెరిగింది. సైడ్ డ్రైయినేజీ మొత్తం చెత్త, మట్టితో పేరుకుపోయి నీరు నిలిచి ఉంటుంది. దీంతో దోమలు పెరుగుతున్నాయి. గ్రామ పంచాయతీ తరపున ఫాగింగ్ చేపట్టడం లేదు. దోమకాటు వల్ల కాలనీలోని చాలా మంది జ్వరాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా ఫాగింగ్ చేపడితే దోమల బెడద నుంచి విముక్తి కలుగుతుంది.

- దాసరి రాందాస్, ఎన్టీఆర్ కాలనీ, గోవిందరావుపేట

చర్యలు చేపడుతాం..

గోవిందరావుపేటతో పాటు గ్రామాల్లో పేరుకుపోతున్న చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నాం. సరైన డ్రైయినేజీ వ్యవస్థ లేకపోవడంతో నీరు నిల్వగా మారి దోమలు విస్తరిస్తున్నాయి. పారిశుద్ధ్య కార్మికులతో ఫాగింగ్ చేయిస్తాం. కొన్ని జీపీల్లో ఫాగింగ్ యంత్రాలు లేవు.

- శంకర్, ఇన్‌చార్జ్, ఎంపీఓ

బీఆర్‌ఎస్, బీజేపీ రాజకీయం చేయొద్దు

కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

ఎస్ఎస్‌తాడ్వాయి : స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లకోసం రైతులను అడ్డుపెట్టుకుని బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు రాజకీయాలు చేయడం సరైంది కాదని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి తండాల శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని నార్లాపూర్ గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ నాయకులకు మేడారం రైతులకు పంట నష్టపరిహారం చెల్లించాలనే విషయం గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. ఇప్పటికే మంత్రి సీతక్క మేడారం ప్రాంత రైతుల పంట నష్టపరిహార విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రాజకీయ లబ్ధి, పదవులు, ఓట్ల కోసం రైతులను పంట నష్టం పేరుతో మోసం చేస్తున్నారని ఈ విషయాన్ని రైతులు గమనిస్తున్నారని తెలిపారు.బీఆర్‌ఎస్ ప్రభుత్వ పాలనలో గుర్తుకు రాని నాయకులకు అధికారం కోల్పోయిన తర్వాత రైతుల నష్ట పరిహారం గుర్తుకు వచ్చిందా అని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని జీర్ణించుకోలేక ప్రభుత్వంపై రైతుల పేరుతో రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. రైతులకు న్యాయం చేయాలనే ఆలోచన సీతక్క దృష్టిలో ఉందని ప్రతిపక్షాల నాయకుల మోసపూరిత మాయమాటలను రైతులు నమ్మొద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎంపీపీ ఎనగంటి రాములు, నాయకులు మొక్క శ్రీనివాస్, కాల్వల సమ్మయ్య, బొప్ప వినోద్, సంకే శ్రావణ్, బండి నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయాలి



ములుగు రూరల్: మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ రమేష్

ములుగు రూరల్ : దివ్యాంగులు, వృద్ధుల పింఛన్ పెంపుపై ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జ్ చాతాళ్ల రమేష్ అన్నారు. శనివారం మండలంలోని మల్లంపల్లి మండలం కొడిశలకుంటలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లను పెంచకుండా కాలయాపన చేస్తోందని అన్నారు. పెన్షన్ పెంపు కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో చేపడుతున్న సభకు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు. నాయకులు మడిపల్లి శ్యాంబాబు, బానోత్ యాకూబ్ నాయక్, అచ్చమ్మ, దేవమ్మ, రఘుపతిరెడ్డి, వెంకట్‌రెడ్డి, రమేష్, చంద్రమౌళి, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



గోవిందరావుపేట: మాట్లాడుతున్న మొగిలి

రేపు చలో కలెక్టరేట్

గోవిందరావుపేట : జిల్లాలోని దివ్యాంగులు, వృద్ధులకు కొత్త పెన్షన్ లబ్ధిదారులందరికి పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 8వ తేదీ సోమవారం చలో కలెక్టరేట్ ముట్టడి విజయవంతం చేయాలని ఎమ్మార్పీస్ మండల అధ్యక్షుడు ఎనగందుల మొగిలి మాదిగ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మండలంలోని గోవిందరావుపేట, రంగాపురం, మొద్దులగూడెం గ్రామాల్లో ప్రచారం నిర్వహించి, అనంతరం మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలనకనారు. దివ్యాంగుల హక్కుల పోరాట సమితి నాయకుడు బుర్రి వీరయ్య, కల్లుగీత కార్మికుల నాయకురాలు కాసగాని లచ్చమ్మ, కడారి పూలమ్మ, మొగిలి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గణపతి విగ్రహాల ఊరేగింపు



వెంకటాపురం(కె): గణపతి విగ్రహాన్ని ఊరేగిస్తున్న భక్తులు



వెంకటాపురం(కె): వేలంలో లడ్డూ దక్కించుకున్న నరేష్



వాజేడులో గణపతి శోభాయాత్ర

వెంకటాపురం(కె) : మండలంలో వినాయక విగ్రహాల నిమజ్జన కార్యక్రమాన్ని శనివారం గణపతి ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహించారు. మండల కేంద్రంలోని శివాలయం సెంటర్, స్టేట్ బ్యాంక్ సెంటర్, బీసీ మర్రిగూడెం, జక్కులవారి వీధి, రజక వీధి, వేపచెట్టు సెంటర్లలోని విగ్రహాలను వెంకటాపురం మండల కేంద్రంలో ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పాత్రాపురం పంచాయతీలోని పాలెం వాగులో నిమజ్జనం చేశారు. కాగా మండల కేంద్రంలోని బ్రహ్మం వస్త్ర దుకాణం సెంటర్‌లో ఏర్పాటు చేసిన గణపతి మండపంలోని లడ్డును అలోకం నరేష్ వేలంలో దక్కించుకున్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనాలు

వాజేడు : మండల పరిధిలోని పలు గ్రామాల్లో నవరాత్రులు పూజలందుకున్న వినాయకులను శనివారం గోదావరిలో నిమజ్జనం చేశారు. మండల కేంద్రంలో నెలకొల్పిన వినాయకుడికి శనివారం వాజేడు ఎస్సై జక్కుల సతీష్ పూజలు నిర్వహించారు. శుక్రవారం స్వామివారిని నిమజ్జనం చేయకూడదనే కారణంతో వాజేడు, జంగాలపల్లి, ప్రగళ్లపల్లి, శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేశారు.

రామాలయంలో లడ్డూ వేలం

ఏటూరునాగారం : మండల కేంద్రంలోని రామాలయంలో గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా లడ్డూ వేలం పాటను హైదరాబాద్ సీఐ, ఏటూరునాగారం నివాసి పెండ్యాల దేవేందర్ మాధురి దంపతులు రూ.20,116లకు వేలంపాటలో దక్కించుకున్నారు. అదేవిధంగా కలశం వేల పాటలో గాదె సత్యం రూ.6,116లు దక్కించుకోగా వారికి కమిటీ సభ్యులు అప్పగించి సన్మానించారు.

మహిళా సాధికారతపై అవగాహన



చిట్యాల : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా సంక్షేమ అధికారి మల్లేశ్వరి ఆదేశాల మేరకు మహిళా సాధికారతపై విద్యార్థులకు శనివారం సిబ్బంది అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీడీఓ జయశ్రీ, మహిళా సాధికారత సిబ్బంది (ఉమెన్ హబ్) అనూష, మమత హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆడపిల్లల రక్షణ, విద్య కోసం బేటీ బచావో.. బేటీ పడావో పథకం ప్రారంభించారని తెలిపారు. అలాగే మొబైల్ వాడటం వల్ల జరిగే నష్టాలు, ఆడపిల్లలపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయని పోక్సో చట్టం తీసుకువచ్చారని, సోషల్ మీడియా పట్ల జాగ్రత్త ఉండాలన్నారు. మహిళలు ఆపద సమయంలో ఉమెన్ హెల్ప్‌లైన్ 181, వృద్ధులు 14567, సైబర్ క్రైమ్ టోల్ ఫ్రీ నంబర్ 1930 ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జయప్రద, ఏపీఎం మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ముసాయిదా ఓటరు జాబితా ప్రదర్శన



మంగపేట: జాబితాను ప్రదర్శిస్తున్న అధికారులు

మంగపేట : మండలంలోని ఎంపీటీసీ స్థానాల ముసాయిదా ఓటరు లిస్టు, పోలింగ్ కేంద్రాల జాబితాను ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలోని 14 ఎంపీటీసీల వారిగా డ్రాఫ్ట్ ఓటరు లిస్టు, పోలింగ్ కేంద్రాల జాబితాను ఆయా పంచాయతీల కార్యదర్శులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ భద్రు నాయక్ మాట్లాడుతూ..ఆయా గ్రామ పంచాయతీల్లో ఓటరు లిస్టు, పోలింగ్ కేంద్రాల వివరాలను ప్రదర్శించాలని సూచించారు. ఓటరు లిస్టు, పోలింగ్ కేంద్రాలపై ఎవరికైనా ఎలాంటి అభ్యంతరాలు ఉన్నా ఈనెల 8వరకు స్వీకరించాలని కార్యదర్శులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ నాగేందర్, జూనియర్ అసిస్టెంట్ సునీత, కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఏటూరునాగారం : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో భాగంగా ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏటూరునాగారం మండల ఓటరు జాబితాను శనివారం విడుదల చేసినట్లు ఎంపీడీఓ శ్రీనివాస్ శనివారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎదుట ఓటరు జాబితా ముసాయిదాను విడుదల చేశారు. ఈనెల 8న ఎంపీడీఓ కార్యాలయంలో రిజిస్టర్ అయిన రాజకీయ పార్టీల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఆయన వెల్లడించారు. ఓటరు జాబితా ముసాయిదా ప్రచురణలో ఏదైనా అభ్యంతరాలు, సూచనలు ఉంటే పార్టీల నాయకులు ఎంపీడీఓ కార్యాలయం, లేదా గ్రామ పంచాయతీలో అభ్యంతరాలు వ్యక్తపర్చాలన్నారు. 8వ తేదీన జరుగబోయే పార్టీ నాయకుల సమావేశానికి విధిగా హాజరై అభ్యంతరాలు అందించవచ్చని కోరారు.

ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

ఎస్ఎస్‌తాడ్వాయి : డ్రాఫ్ట్ పోలింగ్ బూత్‌ల ఓటరు జాబితాపై అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు ఎంపీడీఓ సుమనవాణి తెలిపారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో ఓటరు జాబితాలను ప్రదర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 8వతేదీ వరకు ఓటరు జాబితా అందుబాటులో ఉంటుందన్నారు. ఎంపీఓ శ్రీధర్‌రావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ములుగు: ఉత్తమ ఉపాధ్యాయులతో డీఈఓ సిద్దార్థరెడ్డి, తహసీల్దార్ విజయభాస్కర్



గోవిందరావుపేటలో..

ములుగు : ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ములుగు మండలంలో 15 మందిని ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసినట్లు ఎంఈఓ వజ్జ తిరుపతి తెలిపారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఉత్తమ ఉపాధ్యాయుల సన్మానోత్సవ కార్యక్రమానికి డీఈఓ సిద్దార్థరెడ్డి, తహసీల్దార్ విజయభాస్కర్ హాజరై ఉపాధ్యాయులను శాలువాలతో సత్కరించి మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యాకూబ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోకిల శ్రీరంగం, డీసీఈబీ సెక్రటరీ సూర్యనారాయణ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు పుష్ప, రమేష్, వినోద్‌కుమార్, సునిత, వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు ముకుందారెడ్డి, మధు, వెంకటస్వామి, జ్యోతి, హమీద్, దిలీప్ పాల్గొన్నారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

గోవిందరావుపేట : మండల విద్యావనరుల కేంద్రంలో శనివారం ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మండలంలోని కేజీబీవీ, మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ప్రాథమిక పాఠశాలల నుంచి ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక జరిగింది. ఎంఈఓ గొంది దివాకర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మండల పరిధిలోని 22మంది టీచర్లు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికై సన్మానాలు పొందారు.



వెంకటాపురం(ఎం): సన్మానం పొందిన ఉత్తమ ఉపాధ్యాయులు

ఈ సందర్భంగా సన్మాన గ్రహీతలు మాట్లాడుతూ.. ప్రభుత్వం పాఠశాలల అభివృద్ధిపై చూపుతున్న శ్రద్ధను, విద్యార్థుల భవిష్యత్‌పట్ల అంకితభావాన్ని ప్రశంసించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు సామర్థ్యాధారిత బోధన అందిస్తున్నామని, దీంతో శాస్త్ర సాంకేతిక విజ్ఞానం కూడా పెంపొందుతోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమీ మానిటరింగ్ ఆఫీసర్ కె.మల్లారెడ్డి, జిల్లా సైన్స్ అధికారి జయదేవ్, స్కూల్ కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు కె.సోమారెడ్డి, ఉపాధ్యాయ సంఘాల జిల్లా బాధ్యులు వాసుదేవ రెడ్డి, సమ్మయ్య, మండల బాధ్యులు నాగేశ్వరరావు, చంద్రారెడ్డి, రామ్‌కుమార్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్‌ను నిర్మించాలి

వెంకటాపురం(ఎం) : విద్యార్థుల భవిష్యత్ నిర్మాణంలో ఉపాధ్యాయులదే కీలకపాత్ర అని వెంకటాపురం ఎంఈఓ ప్రభాకర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన సన్మానం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. విద్యారంగంలో విశేష సేవలందించిన ఉపాధ్యాయులను మండలస్థాయిలో గుర్తించి వారికి సత్కారం చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడు రాధిక, లకోష్మరెడ్డి, భాగ్యలక్ష్మి, చంద్రశేఖర్, ఎల్ఎఫ్ఎల్ హెచ్ఎంలు నర్సింగారావు, రాజిరెడ్డి, రవీందర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



ఏటూరునాగారం : టీఎల్ఎం మేళాను ప్రారంభిస్తున్న ఎంఈఓ మల్లయ్య



కన్నాయిగూడెంలో..



వెంకటాపురం(కె) : మేళాను పరిశీలిస్తున్న ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్

కన్నాయిగూడెం : టీఎల్ఎంతో విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఎంఈఓ సాంబశివరావు అన్నారు. శనివారం మండలంలోని ముప్పనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సాంబశివరావు టీఎల్ఎం మేళా ఏర్పాటు చేశారు. మండలంలోని వివిధ పాఠశాల ఉపాధ్యాయులు నూతన ఆలోచనలతో విద్యార్థులకు వివిధ పాఠ్యాంశాలకు చెందిన చిత్రాలు, ప్రాక్టికల్‌గా తయారు చేసి స్టాల్స్ ఏర్పాటు చేశారు. ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాల్, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

టీఎల్ఎంతో సులభంగా బోధన

వెంకటాపురం(కె) : మండల పరిధిలోని చిరుతపల్లి బాలికల ఆశ్రమ పాఠశాలలో శనివారం విద్యాశాఖ ఆధ్వర్యంలో టీఎల్ఎం మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్ ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించేందుకు టీఎల్ఎం ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు. మండ విద్యాశాఖ అధికారి జీవీవీ సత్యనారాయణ మాట్లాడుతూ.. ఈ టీఎల్ఎం మేళాలో మండలం నుంచి 150 ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకట్రావ్, సోమ్లా, రాజారావు, నర్సింహా రావు, రవీందర్ తదితరులు ఉన్నారు.

విద్యాసామర్థ్యాలను పెంచాలి

ఏటూరునాగారం : ఉపాధ్యాయులు విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాలను పెంపొందించేందుకు నిత్యం కృషి చేయాలని ఎంఈఓ కొయ్యడ మల్లయ్య అన్నారు. శనివారం ఎంఈఓ కార్యాలయంలో మండల స్థాయి టీఎల్ఎం మేళా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల్లో తెలుగు, ఇంగ్లిషు, గణితం, పరిసరాల విజ్ఞానాన్ని విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించేందుకు మెటీరియల్ రూపొందించాలన్నారు. ఆయా పాఠశాలల నుంచి పాల్గొన్న ఉపాధ్యాయులు ప్రవళిక, స్రవంతి, ప్రవీణ్ ప్రథమ స్థానంలో నిలిచారు. ఎస్.స్రవంతి, ఎం.రాజేందర్, బి.ప్రవీణ్, నీలిమ, డి.సౌజన్య, సారంగపాణి ద్వితీయ స్థానంలో నిలిచారు. జిల్లాస్థాయి మేళాకు ఎంపికైన వారిని అభినందించి ప్రశంస పత్రాలు అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ మండల అధ్యక్షుడు మంచర్ల వీరభద్రం, ప్రసాద్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ



ములుగు రూరల్ : మండలంలోని మదనపల్లి గ్రామానికి చెందిన దూడపాక మహేందర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని ములుగు గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ శనివారం పరామర్శించారు. ఈ మేరకు మహేందర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బాధిత కుటుంబానికి క్వింటా బియ్యం అందించారు. నాయకులు నల్లెల్ల భరత్‌కుమార్, జన్ను రవి, జయాకర్, నాగరాజు, అభినయ్‌చారి, లక్క, రాజు, దేవేందర్ నాయక్, రాజన్న, సాగర్ తదితరులు ఉన్నారు.